తరలిన కాంగ్రెస్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: కొండాపూర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం తరలి వెళ్లారు. కార్యక్రమంలో పురంధర్ రెడ్డి, సంజీవరెడ్డి, రామకృష్ణగౌడ్, హరినాథ్, రామ్ చందర్, ఇబ్రహీం, లింగం, చందు, జి ప్రసాద్, శ్రీధర్, పవన్, రమేష్, అశోక్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

మోతీనగర్: నిర్మల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు మధురానగర్ శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి మిథున్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు జూలై 5వ తేదీలోగా మధురానగర్ మెట్రోస్టేషన్ పిల్లర్ నెంబర్ సి1468 చిరునామాలో సంప్రదించాలని సూచించారు. 18- 30 సంవత్సరాలలోపు మహిళలకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారు అర్హులని, మరిన్ని వివరాలకు 6309987155 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చిన్న వాగు సమీపంలో గల శ్మశానవాటికలో చేపడుతున్న అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.49 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో ప్రహరీ గోడ, చితి మండపాలు నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీఈ నరేందర్, ఏఈ శివకుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్, శ్రీరాములు, అశోక్ సత్తయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శేరిలింగంపల్లి: జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, ఈసీజీ, హార్ట్ రేట్, కంటి, డయాబెటిక్ పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తెలిపారు.

వీధి దీపాలకు మరమ్మతులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఎట్టకేలకు వీధి దీపాలకు మరమ్మతులు ప్రారంభమయ్యాయి. కొత్త దీపాలతో పాటు చిన్నపాటి మరమ్మతులకు నోచుకోక అనేక వీధి దీపాలు వెలగడం లేదు. బుద్వేల్ కిష్టమ్మ గుట్ట మీదుగా కిస్మత్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గతంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. మరమ్మతులు లేకపోవడంతో ప్రస్తుతం వెలగడం లేదు. ఇది ప్రధాన రహదారి కావడంతో రాత్రి సమయంలో చీకటిగా ఉంటోంది. ఈ రహదారిపై గతంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీధి దీపాల నిర్వహణ లేక దీపాలకు చెట్ల తీగలు అల్లుకోవడంతో స్తంభంతో పాటు వీధి దీపం సైతం కనిపించకుండా మారాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ రహదారిపై జీహెచ్‌ఎంసీ వీధి దీపాల నిర్వహణ సిబ్బంది మరమ్మతులను చేపట్టారు. వెలగని వీధి దీపాలు తొలగించి కొత్తవి వేశారు. అలాగే అల్లుకుపోయిన తీగలను తొలగించారు.

ముష్కిచెరువును పరిరక్షించండి

మణికొండ: ముష్కి చెరువు పరీవాహకంలో ఉన్న అపార్ట్‌మెంట్‌ల నుంచి మురుగునీరు వచ్చి చేరుతుందని, దీంతో దుర్గంధం, దోమల బెడద పెరిగిపోతుందని మై హోం అవతార్, హాల్ మార్క్ విసినియా నివాసితులు వాపోయారు. వారు శనివారం మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హాల్‌మార్క్ విసినియా నివాసితుడు గౌతంరెడ్డి మాట్లాడుతూ..చెరువు అభివృద్ధి పేరుతో చుట్టు పక్కల ఉన్న మురుగునీటిని చెరువులో కలుపుతూ స్థానికులకు ఓ సంస్థ నిర్వాహకులు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని తగ్గిస్తూ కట్ట నిర్మాణం చేయడం, చెరువు చుట్టు పక్కల ఉన్న చెట్లను నరికివేయడం, చెరువులోకి మురికి నీరు వచ్చేలా చేస్తున్నారన్నారు. మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులు సదరు సంస్థ చేస్తున్న నిర్వాకాలను వెంటనే అడ్డుకుని చెరువును పరిరక్షించటంతో పాటు చుట్టు పక్కల నివాసితుల ఆరోగ్యాలను పరిరక్షించాలని కోరారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు

పట్టించుకోరేం..

దృష్టి సారించని విద్యాసంస్థల యాజమాన్యాలు



తులసినగర్‌లో ఆగిపోయిన స్కూల్ బస్సును తోస్తున్న విద్యార్థులు

- ఇటీవల వివిధ చోట్ల ప్రమాదాలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- అధికారుల తనిఖీలు అంతంతే..

ఆల్విన్‌కాలనీ: ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలే జరిగిన పలు ప్రమాదాలు, ఓ విద్యార్థి స్కూల్ బస్సు కింద పడి చనిపోవటం వంటి ఘటనలతో బెంబేలెత్తుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు, ఆర్‌టీఏ అధికారులు స్కూల్ ప్రారంభానికి ముందే బస్సుల ఫిట్‌నెస్‌తో పాటు వాహనాల తనిఖీలు, రక్షణ ఏర్పాట్లు, డ్రైవర్ల పనితీరుపై శ్రద్ధ వహించాలి. ప్రభుత్వ రవాణాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఫిట్‌నెస్, ఇతర పత్రాలను పొందాల్సి ఉంటుంది. ఆర్‌టీఏ అధికారులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దారిలో స్కూల్ బస్సులు ఆగిపోతుండటంతో విద్యార్థులు బస్సులను నెట్టాల్సి వస్తున్నది. రన్నింగ్‌లో ఉన్న బస్సు ఆగినా.. బ్రేకులు ఫెయిలైతే పరిస్థితి ఏంటని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

నిబంధనలు పట్టవా?

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌ల పరిధిలో ప్రతి వీధిలో ప్రయివేట్ స్కూల్స్ ఉన్నాయి. ఆర్టీఏ నిబంధనలను యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. అక్కడక్కడా స్కూల్స్‌లో బస్సులకు పార్కింగ్ కానీ, స్కూల్ ముందు వాహనాన్ని ఆపి విద్యార్థులను క్షేమంగా కిందకు దింపటానికి కూడా అనువైన పరిస్థితి లేదు. ముందు నుంచి, వెనుక నుంచి వాహనాలు దూసుకు వచ్చి ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఎలాంటి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందకుండానే విద్యార్థులను ఈ బస్సులలో తరలిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కూడా డ్రైవర్లను తక్కువ జీతాలతో యాజమాన్యాలు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

- నాలుగు రోజుల క్రితం ఆల్విన్‌కాలనీ తులసినగర్‌లో ఆడుకుంటున్న విద్యార్థిపై బస్సు వెళ్లటంతో ఆ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కాలనీలో మరుసటి రోజు ఓ స్కూల్ బస్సు ఫిట్‌నెస్ లేక మధ్యలోనే ఆగిపోవటంతో విద్యార్థులు ఆ బస్సును తోస్తూ కనిపించారు. ఇలాంటి సంఘటనలు కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో నిత్యం జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వీడాలి



ఫిట్‌నెస్ లేని వాహనాలు, డ్రైవర్ల పట్ల, మద్యం సేవించే డ్రైవర్ల విషయంలో పాఠశాల యాజమాన్యాలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఇటీవల ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్‌టీఏ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – చిరుమర్తి రాజు, స్థానికుడు

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి

చందానగర్: సిమెంటు రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని చందానగర్ కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి సూచించారు. చందానగర్ డివిజన్ కేఎస్‌ఆర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీరోడ్డు పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లన్నీ దశలవారీగా సీసీరోడ్లుగా మారుస్తామని, పదికాలాలపాటు మన్నేలా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు.



చందానగర్లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంజులారెడ్డి

కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగారెడ్డి, రామారావు, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర



మియాపూర్: అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) మియాపూర్ కేంద్రం ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా జరిగింది. చందానగర్ గంగారంలో జాతీయ రహదారిపై రథయాత్రను ప్రారంభించారు. వివిధ దేశాల నుండి ఇస్కాన్ భక్తులతో పాటు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. ఈ రథయాత్ర గంగారం ఆర్‌ఎస్ బ్రదర్స్ నుండి ఆల్విన్ ఎక్స్ రోడ్డు, మియాపూర్ ఎక్స్ రోడ్డు, జేపీఎన్ నగర్ మీదుగా విశ్వనాథ్ గార్డెన్ వరకు కొనసాగింది. హరే కృష్ణ.. హరే రామ్ నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కృష్ణ భజనలు, కోలాటాలు, నృత్యాలు, కీర్తనలతో యాత్ర కొనసాగింది. అనంతరం మియాపూర్ విశ్వనాథ్ గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు.

రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే

చందానగర్: శ్రీకృష్ణుడి నామస్మరణతో చందానగర్ పులకించిపోయిందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్‌లోని రాంనగర్‌కాలనీలో ప్రధాన రోడ్డులో ఇస్కాన్ హరేరామ హరేకృష్ణ మియాపూర్ శాఖ జగన్నాథ రథయాత్రలో ఆయన పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు రథాన్ని లాగారు. వివిధ మఠాలకు చెందిన ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని భజనలు, కీర్తనలను ఆలపించారు. కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌ఎస్, ఎంఎస్‌ఎఫ్ నూతన కార్యవర్గం



సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్, స్థానిక నాయకులు

రాయదుర్గం: మసీదుబండ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎస్, ఎంఎస్‌ఎఫ్ నూతన కార్యవర్గాలను శనివారం ప్రకటించారు. మసీదుబండలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం కమిటీహాల్‌లో మసీదుబండ ఎంఆర్‌పీఎస్ సమావేశాన్ని నాయకుడు కొడిచెర్ల ప్రేమ్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్‌మాదిగ కమిటీలను ప్రకటించారు. ఎంఆర్‌పీఎస్ నూతన అధ్యక్షుడుగా కొడిచర్ల మనోజ్, ఉపాధ్యక్షుడిగా కొడిచర్ల కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా వినోద్ కుమార్, కార్యదర్శి బైండ్ల రామకృష్ణ, సహాయకార్యదర్శిగా ప్రశాంత్, ప్రచార కార్యదర్శిగా గండి బన్నీ, గౌరవ సలహాదారు కొడిచర్ల రాము, రామేశ్వరం బాలరాజు, వినోద్, ప్రభాకర్, దర్శన్, నర్సింహ, కార్యవర్గసభ్యులుగా మహేందర్, ధనుష్, నాగరాజును నియమించారు. మాదిగ యువసేన అధ్యక్షుడుగా కొడిచర్ల శ్రీనివాస్, ఎంఎస్‌ఎఫ్ మాదిగ విద్యార్థి సమాఖ్య గ్రామ అధ్యక్షుడుగా కొడిచర్ల ఆదిత్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కొండాపూర్, శేరిలింగంపల్లి డివిజన్ల ఇన్‌చార్జీ ఐతా రమేష్, బస్తీ నాయకులు రాము, అంజన్న, లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ పరిధిలోని బ్రహ్మంగారి ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 41రోజులైన సందర్భంగా హోమం, అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం, గోపాల్, ప్రకాష్, శ్రీరాములు, భీమలింగ, కృష్ణ, నరహరి తదితరులు పాల్గొన్నారు.

రేపు అదనపు తరగతి గదులు ప్రారంభం

పటాన్‌చెరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మించిన 15 అదనపు తరగతి గదులు పూర్తయ్యాయని..ఈనెల 30 వ తేదీ సోమవారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం జూనియర్ మరియు డిగ్రీ కళాశాల భవనాలను పరిశీలించారు. వీటితో పాటు మండల పరిషత్, జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలోనూ కోటి రూపాయలతో అదనపు తరగతి గదులు నిర్మించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రాజేంద్రనగర్: శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.3 కోట్లతో మౌలిక వసతులను కల్పించేందుకు విర్టుసా మల్టీ నేషనల్ కంపెనీ ముందుకు వచ్చింది. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి శనివారం పూజ చేశారు. ప్రస్తుతం గ్రౌండ్ లెవెలింగ్, భవనం మొత్తం ఐరన్ గ్రిల్స్, పెయింటింగ్ మొదటి విడతలో చేపట్టింది. ఈ మొత్తం పని జరిగితే కార్పొరేట్ పాఠశాల భవనం మాదిరిగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సరళమ్మ, ఉపాధ్యాయులు రాజ మహేందర్ రెడ్డి, సుదర్శన్, వెంకటయ్య, నర్సింహా చారి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరాంనగర్ ఎన్నికలు

మణికొండ: శ్రీరాంనగర్ (సెక్రటేరియట్) కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం కమ్యూనిటీహాల్‌లో నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తామన్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి పదవులకు పోటీ పెరగడంతో ఎన్నికలు నిర్వహిస్తున్నామని, మిగతా పదవులకు ఏకగ్రీవంగా ఎన్నిక జరిగిపోయిందన్నారు. సంక్షేమ సంఘం ఎన్నికలను కొందరు అభ్యర్థులు ప్రతిష్ఠగా తీసుకుని మున్సిపాలిటీ వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, సోషల్ మీడియాలో ప్రచారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కాలనీవాసులు ఎవరి సారథ్యాన్ని కోరుకుంటున్నారనే విషయం ఫలితాల్లో తేలనుంది.

• నృత్య నీరాజనం

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం చెన్నైకి చెందిన భరతనాట్య కళాకారిణి స్మితి విక్రమ్ పుష్పాంజలి, మయూర అలరిపు, శివస్తుతి, అభంగ్, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. శ్రీనృత్య అకాడమీ గురువు ప్రత్యూష శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. స్వర పల్లవి, వినాయకకౌతం, ఇందరికి అభయములిచ్చు, భజమానస, రామాయణశబ్దం, జయము జయము, జతిస్వరం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు శివాని, సాన్వితసాయి, సాత్విక, అనన్యసాయి, అపూర్తి, సాన్విక, శ్రీజీవిత, హంసిక, సహస్ర, ద్రితి, నిత్య నేహ, ఐశ్వర్య, హసవిత, దుర్గ, హిమశ్రీ తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం తేజస్వీ నృత్యాలయ నృత్య నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువు దివ్య తేజస్వీ శిష్య బృందం మహాగణపతిం, గురుబ్రహ్మ, గురువిష్ణు, భావములోన, ఒకపరి ఒకపరి, జగడపు, అదిగో అల్లదిగో, ఎందరో మహానుభావులు కీర్తనలకు కళాకారులు వేదశ్రీ, అక్షితరెడ్డి, అర్జితరెడ్డి, రుత్విక, లౌక్య, రియాన్షి, వైష్ణవి, ధృవి, అదితి, లీజ, నిత్య, రమ్యకృష్ణ, భవాని, సుదేక్ష, మోనికాసాయి మానస, అంచల్‌సింగ్ తదితరులు ప్రదర్శించారు. అనంతరం కళాకారులను వ్యవస్థాపకురాలు డాక్టర్ శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నందకుమార్‌లు సత్కరించారు.



అన్నమయ్యపురంలో





శిల్పారామంలో..

నడిగడ్డతండాలో హాథీరామ్‌బాబా జయంతి

మియాపూర్: మియాపూర్ నడిగడ్డతండాలో హాథీరామ్‌బాబా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గాంధీ, మాజీ ఎంపీ రవీంద్రనాయక్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండా గిరిజన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాజీ ఎంపీ రవీంద్రనాయక్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జగన్‌నాయక్, ఎస్పీ నాయక్, కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్‌రావు, నాయకులు గంగాధర్ రావు, దామోదర్ రెడ్డి, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు స్వామినాయక్, తిరుపతి నాయక్, సీతారాం నాయక్, శంకర్ నాయక్, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

‘మనీ వైబ్ ’ పుస్తకావిష్కరణ

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని కోకో రెస్టారెంట్‌లో ఆనంద్‌మెహతా రచించిన ‘మనీ వైబ్ ’ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ‘ప్యానల్ డిస్కషన్’ నిర్వహించారు. ఆనంద్‌మెహతా ,మోడరేటర్ ప్రియా రాజీవ్, ప్యానలిస్టులు తాహిర్‌అలీ బేగ్, మాద్వి చంద్రలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గుజరాతీ వ్యాపార విలువల నుంచి నేర్చుకున్న అంశాలను ఆర్థిక స్థిరత్వం, వృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, వ్యూహాలను పంచుకున్నారు. ఈ పుస్తకం ఆర్థిక సాధికారతకు రోడ్ మ్యాప్ లాంటిదని ఇది అన్ని వర్గాల పాఠకులకు అనుకూలంగా ఉంటుందని అన్నారు.



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రచయిత ఆనంద్ మెహతా, అతిథులు

ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: బుద్వేల్ ప్రాంతం భక్తి గీతాలతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు మారుమోగింది. బుద్వేల్ కట్ట మైసమ్మ ఆలయ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ఆవరణలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం రాత్రి 11 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున 4 గంటల వరకు భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వ్యాపారస్తులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లను పొందాలని ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ వ్యాపారస్తులకు సూచించారు. సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని వ్యాపారస్తులను గుర్తించి ట్రేడ్ లైసెన్స్‌ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. వ్యాపారాలు నిర్వహించే వారు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలన్నారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే లైసెన్స్‌లను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ ద్వారా వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని మరింత విస్తృత పరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. జూలై నెల నుంచి ట్రేడ్ లైసెన్స్ లేని వారిని గుర్తించి అపరాధ రుసుం విధిస్తామన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేందుకు జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని సంప్రదించాలని..లేదా వారి వద్దకు వచ్చే రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ప్రణాళికాబద్ధంగా డివిజన్ల అభివృద్ధి



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: బల్దియా పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రపురం, భారతినగర్ డివిజన్‌ల పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం నుండి మున్నూరు కాపు సంఘం వరకు రూ. ఒక కోటి 40 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు శనివారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, తదితర మౌలిక వసతుల కల్పన కు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, న్యాయవాది నాగరాజు యాదవ్, జీహెచ్‌ఎంసీ డీఈ నరేందర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.